## క్లుప్తంగా

### ఆర్థిక సాయం అందజేత



పెళ్లికుమార్తెకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: బోరవానిపేటలో పేద కుటుంబానికి చెందిన బోర కాంచనమాల పెళ్లి ఖర్చులకు స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు విరాళాలు సేకరించారు. భజనమండలి కన్వీనర్ నరసింహా రౌలే, సేవాదళ్ కన్వీనర్ బి.సింహాచలం మాస్టర్ రూ.2,70,000ను సోమవారం అందజేశారు. టీసీఎస్‌లో పని చేస్తున్న ఆర్.ప్రశాంతకుమార్ స్నేహితులు నిర్వహిస్తున్న సద్గురు ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.లక్ష్మీ, జి.లావణ్య, కె.వేణుగోపాల్, జె.సత్యనారాయణ, ఏ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదానం చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: అరిణాం అక్కివలస శ్యాంక్రగ్ పిస్టన్స్ వ్యవస్థాపకులు దాలి మృత్యుంజయరావు వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి ఉద్యోగులు, కార్మిక నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. 139 మంది కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్వీ రమణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రిమ్స్ అన్నపూర్ణ పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు దేశరాజు వెంకట శ్రీనివాస్ రూ.10వేలు విరాళంగా సోమవారం అందజేశారు. తల్లిదండ్రులు దేశరాజు సూర్యారావు, సత్యవతి పెళ్లి రోజు సందర్భంగా రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావుకు ఈ మొత్తం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు.

### ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంభం



వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్–2025 బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 280 మందికి గాను 260 మంది, రెండో షిఫ్టులో 280 మందికి గాను 264 మంది హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 171 మందికి గాను 158 మంది, రెండో షిఫ్టులో 171 మందికి గాను 154 మంది హాజరయ్యారు. ఈ నెల 27వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మంగళవారంతో బైపీసీ స్ట్రీం పరీక్షలు ముగుస్తాయి. బుధవారం నుంచి ఎంపీసీ స్ట్రీం పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

### ప్రహరీ కూల్చివేత



గోడను కూల్చివేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండల తహశీల్దార్ కార్యాలయం ప్రహరీని సోమవారం కూల్చివేశారు. డేఅండ్‌నైట్ జంక్షన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఈ గోడను కూల్చివేసినట్లు అధికారులు వెల్లడించారు.

### 1న మోడల్ లాసెట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఎం.పి.ఆర్ లా కాలేజీలో జూన్ 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత మోడల్ లాసెట్ నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఎం.పి.ఆర్ లా కాలేజీలో ప్రిన్సిపాల్ కె.మోషేతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడల్ లాసెట్‌కు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ఐదేళ్లు, మూడేళ్ల లా కోర్సుల కోసం దరఖాస్తు చేసిన వారంతా హాజరుకావచ్చని చెప్పారు. వివరాలకు 9640780728 నంబరును సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం సీనియర్ సభ్యులు కూన కసవయ్య పాల్గొన్నారు.

# అన్నదాతకు.. అందని సాయం



ఎచ్చెర్లలో వరి సాగు (ఫైల్)

| మండలం | ఎచ్చెర్ల | రణస్థలం | లావేరు | జి.సిగడాం |
|---|---|---|---|---|
| సాగుభూమి(హెక్టార్లు) | 10,587 | 10,889 | 9,762 | 9,573 |
| రైతులు | 14,221 | 14,884 | 12,432 | 12,347 |

- అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అందని సాయం

ఎచ్చెర్ల క్యాంపస్: అన్నదాతలకు సాయం అందని ద్రాక్షలా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు రైతుకు ఆర్థిక సహాయం అందలేదు. 2024 ఏడాది ఖరీఫ్ ముగిసినా కేంద్ర ప్రభుత్వ సహాయం తప్ప రాష్ట్ర సర్కారు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. 2025 ఖరీఫ్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం పేరుతో జిల్లాలో హడావుడి సాగుతోంది. ఎప్పట్లాగే ఈసారి కూడా హడావుడి చేసి వదిలేస్తారా? రైతులకు సాయం ఏమైనా అందిస్తారా? అన్నదానిపై స్పష్టత రావడం లేదు.

**గతంలో ఠంఛన్‌గా అమలు..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ సాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని పక్కాగా అమలు చేసేది. రైతు భరోసా కింద రూ.18,500 కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిసి అందజేసేది. ఖరీఫ్ సీజన్‌కు ముందు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుల మందులు, పచ్చిరొట్ట విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు వంటివి రాయితీపై అందజేసేవారు. రైతులను ఆదుకునే పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ సైతం సకాలంలో అందేవి. సూపర్ సిక్స్ హామీతో పాటు, వ్యవసాయానికి ప్రోత్సాహకాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో నారాయణపురం, మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల కింద సాగునీరు అందక రైతులు గత ఖరీఫ్‌లో పంటసైతం నష్టపోయారు. అయినా బీమా వంటి పథకాలు అమలు కాలేదు.

**సాయం అందించాలి..**



రైతులకు ప్రభుత్వ సహాయం అవసరం. పెట్టుబడి సాయం సకాలంలో అందజేయాలి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు అమలు చేయాలి. అన్నదాత సుఖీభవ సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

– మెట్ట ప్రసాద్, ఎస్‌ఎంపురంపేట

**ఎదురుచూస్తున్నాం..**



అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదిఅమలు చేయలేదు. దీంతో పాటు ఖరీఫ్‌లో పంటలు కూడా కోల్పోయాం. పెట్టుబడి సాయం కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం ఆదుకోవాలి.

– బెందు రామారావు, ముద్దాడ

**హామీ గుర్తులేదా?**



ప్రభుత్వం ఇచ్చిన హామీ ఐదేళ్ల పాటు అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి గుర్తులేక పోవటం దురదృష్టకరం. 2024 ఖరీఫ్‌కు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. ఈ ఏడాదైనా సకాలంలో అమలు చేయాలి.

– సనపల నారాయణరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

**ఏరివేతల భయం..!**

ఒకవేళ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసినా నిబంధనల పేరిట ఎంతమందిని తొలగిస్తారో అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఇటీవల మత్స్యకారుల సేవలో పథకంలో కూడా కూటమి నేతలు ఇలాగే ఏరివేతలు చేపట్టారు. నిబంధనల పేరిట అనేక మంది అర్హులకు మొండి చెయ్యి చూపించారు. అర్హులను సైతం ఫిల్టర్ చేసేశారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవకు ఎన్ని నిబంధనలు విధిస్తారోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

## 21న మహా కుంభాభిషేక మహోత్సవం



సువత్సలా సమేత ఆంజనేయస్వామి



మహాకుంభాభిషేక ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పుణ్యపువీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్సల అభయాంజనేస్వామి ఆలయంలో ఈ నెల 21న మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, భక్తుల చేతుల మీదుగా శిఖర కలశానికి అభిషేకాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ ఏటా హనుమజ్జయంతి, శ్రీరామనవమి, దుర్గానవరాత్రులు ఘనంగా నిర్వహిస్తుంటారు. 2014లో సీతారామచంద్రమూర్తి లక్ష్మణ సహితంగా మందిరాన్ని స్వరూపానందేంద్రస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. నాటి నుంచి ఆలయ కార్యక్రమాలతో పాటుగా ప్రతి నెల రెండో ఆదివారం ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మహా కుంభాభిషేకంలో భాగంగా 301 కలశాలతో అభిషేకాలు చేయనున్నారు. అనంతరం సువత్సలా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 22న హనుమజ్జయంతి పురస్కరించుకొని సామూహిక పూజలు, ఆంజనేయ హోమం, పేదలకు డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు చేతుల మీదుగా వస్త్రదానం జరగనుంది. అదే రోజున తిరువీధి నిర్వహించనున్నారు.

## పిడుగులు పడొచ్చు జాగ్రత్త..



జి.సిగడాం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న తహశీల్దార్ గోపాలరావు

జి.సిగడాం: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ఈ నెల 24వ తేదీ వరకు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ 9618832141 నంబర్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి విపత్తుల శాఖ హెచ్చరికలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల ఇన్‌చార్జి తహశీల్దార్ బి.గోపాలరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి విపత్తులు ఎదుర్కోవటంపై మండల అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు సురక్షిత భవనాల్లో ఉండేలా అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో పీవీఎస్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్వాన రోడ్డుతో అవస్థలు



శాంతినగర్‌కాలనీలో రోడ్డు దుస్థితి

- రాళ్లు తేలిన శాంతినగర్‌కాలనీ రోడ్డు
- పట్టించుకోని పాలకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల్లో గోతులనేవే లేకుండా చేస్తామని ఆర్భాటం పలికిన నాయకులు.. అధికారంలోకి వచ్చాక ఆ సంగతే మర్చిపోయారు. సంక్రాంతి ముందు హడావుడిగా కొన్నిచోట్ల మాత్రమే రోడ్లు వేసి మిగిలిన ప్రాంతాలను వదిలేశారు. దీంతో ఆయా చోట్ల రాళ్లు తేలిన రోడ్లపైనే వాహనచోదకులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. శ్రీకాకుళం నగరంలో శాంతినగర్‌కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి రోడ్డు రాళ్లు తేలడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే ప్రాంతంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నివాసముంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేటప్పుడు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సైకిల్స్ వెళ్లే చిన్నారులు, ద్విచక్రవాహనదారులు స్కిడ్ అయ్యి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

**ఎన్నిసార్లు విన్నవించినా..**

రోడ్డు నిర్మాణం పూర్తిచేయకుండా వదిలేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. రోడ్డు నిర్మించాలని కార్పొరేషన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ.. రోడ్లు, కాలువలు నిర్మించడంలో ఉండకపోవడం అన్యాయం. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– జి.అప్పారావు, శాంతినగర్‌కాలనీ

### క్రీడాకారులకు అభినందనలు




విజేతలను అభినందిస్తున్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీహార్‌లో ఈ నెల 5 నుంచి 15 వరకు జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలో గుజ్జల వర్షిత బంగారు పతకం, కబడ్డీలో ఎస్.రామ్మోహన్ కాంస్య పతకం సాధించారు. వీరిని సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు అభినందించారు.

### విద్యార్థినికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక రెల్లవీధిలో నివాసముంటున్న ఎలుగుమహంతి స్వాతి కుమార్తె అనూష చదువు ఇంజినీరింగ్ చదువు నిమిత్తం ప్రభాకర్ కాలనీకి చెందిన ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, ఉమాలు సోమవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అనూష కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండడంతో ఆమె తాత భువనేశ్వరరావు చదివిస్తున్నారు. బ్యాంకుల నుంచి విద్యారుణం కోసం ప్రయత్నిస్తున్నారని, ఆమె చదువు కొనసాగించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు.

### ప్రభుత్వం దృష్టికి ఎంటీఎస్ టీచర్ల సమస్యలు



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: 1998 డీఎస్సీ మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి న్యాయం జరిగేలా చూస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం అరసవల్లిలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఎమ్మెల్సీ గాదెను 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులు అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో తామంతా నియమాకం అయ్యామని, అనేక రకాల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని ఎమ్మెల్సీకి విన్నవించారు. కార్యక్రమంలో ఎస్.రాజగోపాలనాయుడు, సీహెచ్ మల్లేశ్వరరావు, డీవీఎన్ పట్నాయక్, సాయిబాబా, జి.నారాయణరావు, జె.శ్యాంసుందర్, రమణ, ప్రసాద్, ధర్మ పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి



ఈశ్వరరావు(ఫైల్)

రణస్థలం: కొండములగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోనెల ఈశ్వరరావు (43) ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఈశ్వరరావు ఈ నెల 15వ తేదీ రాత్రి డాబాపై పడుకుని మెట్లపై నుంచి దిగుతుండగా జారిపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈశ్వరరావుకు భార్య మంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, కొండములగాం మాజీ సర్పంచ్ కలిశెట్టి కన్నంనాయుడు, ఎంపీటీసీ రెడ్డి వాసు, చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, చినరామినాయుడు, లక్ష్మునాయుడు, శ్రీనివాసరెడ్డి, అప్పలనాయుడు నివాళులు అర్పించారు. ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భౌగోళిక స్థితిగతులపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: భారతదేశం సరిహద్దులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు దేశ సరిహద్దులపై అవగాహన కల్పించారు.

### రోడ్డుకు మోక్షమెప్పుడో?



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో దూసి రోడ్డును ఆనుకొని వంజంగి గట్టుముడిపేట గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

### ప్రకృతి వ్యవసాయమే మేలు



భూమిని సారవంతం చేయడంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయమే మేలని రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ట్రైనర్ సువ్వారి సన్యాసిరావు అన్నారు. సంత సీతారాంపురంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి రైతులను సన్మానించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

### ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నానాజీ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషిచేస్తామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.నానాజీ హామీ ఇచ్చారు. ఏపీ పీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి సమావేశాన్ని శ్రీకాకుళంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. కార్మికుల జీతభత్యాల బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలపై చర్చించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్, రాష్ట్ర రిటైర్డ్ సంఘ అధ్యక్షుడు శర్మ, ఔట్ సోర్సింగ్ నాయకులు ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, ట్రెజరర్ నవీన్, అనిల్, రామ్మోహన్, సతీష్, వేణు, నేతాజీ, సంతోష్, రాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

రణస్థలం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణను జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు సోమవారం పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎచ్చెర్ల, ఆమదాలవలస, టెక్కలి నియోజకవర్గాల సమన్వయకర్తలు గొర్లె కిరణ్‌కుమార్, చింతాడ రవికుమార్, పేరాడ తిలక్, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

## కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలి



రణస్థలం: సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు



ఎచ్చెర్ల క్యాంపస్: సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్మిక యూనియన్లు

ఎచ్చెర్ల క్యాంపస్ : కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. అరిణాం అక్కివలస శ్యాంక్రిగ్ పిస్టన్స్, ఎస్‌ఏసీఎస్, ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ఆవరణల్లో కార్మిక యూనియన్లు ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు రామప్పడు, రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: కార్మికులు, కర్షక ఐక్య పోరాటాలను నిర్మించడమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు అర్పించే ఘన నివాళులని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సభను సోమవారం బుడుమూరులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.ఆదినారాయణ, ఎస్.శ్రీనివాసరావు, పి.సూరిబాబు, ఎ.వేణు, ఎస్.వీర్రాజు, ఎస్.దుర్గారావు, ఏ.అప్పలరాజు, రవి పాల్గొన్నారు.

రణస్థలం: సోషలిజంతోనే సమసమాజం సాధ్యమవుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. శ్రమజీవుల హక్కులు కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సోషలిజం, ప్రజాస్వామ్యం కొరకు నిరంతరం కృషి చేసిన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా వరిశాంలోని శ్యాంపిస్టన్ పరిశ్రమ వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెంపడాపు లక్ష్మణరావు, మహేష్, ఎం.రమణ, వి.మధు, సూరప్పన్న తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: బుడుమూరులో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న కార్మికులు